ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 19-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- డిజిటల్ ఇండియా చొరవ అనేక రంగాలలో నూతన అవకాశాలను కల్పిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు.
- సహజ వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి కేంద్రంగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ మరోసారి బాధ్యతలు చేపట్టనున్నారు.
- స్వచ్ఛ భారత్ మిషన్ కింద దేశ వ్యాప్తంగా 11 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వెల్లడించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

==========

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) 5వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ఈరోజు ప్రసంగిస్తూ.. డిజిటల్ ఇండియా చొరవ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అనేక రంగాలలో నూతన అవకాశాలను కల్పిస్తోందన్నారు. అందరికీ సమాన అవకాశాలను అందించేందుకు మారుమూల ప్రాంతాలకు సైతం వేగవంతమైన ఇంటర్నెట్ సేవలను, సాంకేతికతను తీసుకువెళుతున్నామని చెప్పారు. విద్యార్థులు వినూత్న మార్గాలలో ఆలోచించి, ఇంకా ఉనికిలో లేని సాంకేతికతలను కనుగొనడానికి కృషి చేయాలని కోరారు. మోడల్ డిజిటల్ గ్రామాలను సృష్టించడంలో ఎన్ఐటీ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి మాట్లాడుతూ...

(వాయిస్ 34 సెకన్లు)

==========

సహజ వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి కేంద్రంగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన "దక్షిణ భారతదేశ సహజ వ్యవసాయ సదస్సు"లో పీఎం- కిసాన్ పథకం 21వ విడత నిధులను ప్రధానమంత్రి ఈరోజు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లో సుమారు 18 వేల కోట్ల రూపాయలు నిధులు ఈ పథకం కింద జమ కానున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... సేద్యంలో రసాయన ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగంతో నేల సారం దెబ్బతింటుందని, పంట వైవిధ్యీకరణ, సేంద్రియ సాగుతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. దేశంలో వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు అయ్యాయని, వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. జీవ ఎరువులపై జి.ఎస్.టి. తగ్గింపు కూడా రైతులకు గణనీయంగా దోహదపడిందని ప్రధానమంత్రి ప్రసంగిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========

బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ మరోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రోజు జరిగిన జనతాదళ్ యునైటెడ్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) శాసనసభా పక్ష సమావేశంలో నితీష్ కుమార్ ను శాసనసభా పక్ష నేతగా కూటమి నాయకులు ఏక గ్రీవంగా ఎనుకున్నారు. దీంతో నితీష్ కుమార్ 10వ సారి ముఖ్యమంత్రి కానున్నారు. ఈ రోజు సాయంత్రం కూటమి శాసన సభ్యులతో కలిసి గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్‌ను కలిసిన నితీష్ కుమార్ నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని కోరారు. ఇటీవల ముగిసిన బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. రేపు బీహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ పాట్నాలోని గాంధీ మైదానంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాల నాయకులు హాజరుకానున్నారు.

==========

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ రేపటి నుండి మూడు రోజుల పాటు ఇజ్రాయెల్ లో పర్యటించనున్నారు. కేంద్రమంత్రితో పాటు CII, FICCI, అసోచామ్, స్టార్ట్ అప్ ఇండియాలకు చెందిన 60 మంది ప్రతినిధుల బృందం ఇజ్రాయెల్ లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా పీయూష్ గోయల్ ఇజ్రాయెల్ దేశ ఉన్నత అధికారులతో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడం, వ్యవసాయం, రక్షణ, అధునాతన తయారీ వంటి కీలక రంగాలలో సహకారాన్ని పెంపొందించడం, రెండు దేశాల వ్యాపారాల మధ్య మెరుగైన సహకారానికి అవకాశాలను అన్వేషించడంపై ఈ సమావేశాలలో చర్చించనున్నట్లు తెలిపింది. ఈ పర్యటన భారతదేశం, ఇజ్రాయెల్ మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేస్తుందని పరస్పరం ఆసక్తి ఉన్న రంగాలలో సహకారానికి నూతన మార్గాలను సృష్టిస్తుందని ఆ శాఖ పేర్కొంది.

విరామం

==========

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 26 నుండి డిసెంబర్ 6వ తేదీ వరకు జాతీయ స్థాయి పాదయాత్రను నిర్వహించనున్నట్లు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. పాదయాత్ర వివరాలను న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి వివరిస్తూ... సర్దార్@150 పేరిట నిర్వహిస్తున్న ఐక్యతా మార్చ్ దేశ ఐక్యతకు గుండె చప్పుడు అని అన్నారు. ఈ పాదయాత్ర స్వచ్ఛత, స్వదేశీ, ఆత్మనిర్భరత వంటి సందేశాలను తెలియజేస్తుందన్నారు. ఈ ఐక్యతా

మార్చ్ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ పూర్వీకుల గ్రామం కరమ్‌సద్ నుండి ప్రారంభమై 150 కిలో మీటర్లు ప్రయాణించి నర్మదా నది మధ్య ఉన్న ఐక్యతా విగ్రహం వద్దకు చేరుకుంటుందని మంత్రి తెలియజేశారు.

==========

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి మూడు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పర్యటించనున్నారు. ఛత్తీస్‌గఢ్ పర్యటనలో భాగంగా రేపు అంబికాపూర్‌లో జరిగే "జన్ జాతీయ గౌరవ్ దివస్" వేడుకలకు రాష్ట్రపతి హాజరుకానున్నారు. అలాగే 21వ తేదీన తెలంగాణలోని సికింద్రాబాద్‌లో రాష్ట్రపతి నిలయంలో "భారతీయ కళా మహోత్సవ్ – 2025"ను ప్రారంభిస్తారు. ఈ ఉత్సవంలో గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్ హవేలి, డామన్ డయ్యూ రాష్ట్రాల సాంస్కృతిక వంటకాలు, కళాత్మక సంప్రదాయాలను ప్రదర్శిస్తారు. 22వ తేదీన ఆంధ్రప్రదేశ్ లోని పుట్టపర్తిలో ప్రశాంతి నిలయంలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరవుతారు.

==========

స్వచ్ఛ భారత్ మిషన్ తో పారిశుధ్యం, పరిశుభ్రతలో దేశం అద్భుతమైన పురోగతిని సాధించిందని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ మిషన్ కింద ఇప్పటి వరకూ 11 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని చెప్పారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభమైన ప్రపంచ టాయిలెట్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... గ్రామీణ భారతదేశంలో మరుగుదొడ్ల నిర్మాణం ప్రజల ఆరోగ్యంతో పాటు వారి గౌరవాన్ని కూడా కాపాడిందన్నారు. పారిశుధ్యం పట్ల పరిశుభ్రత ఉద్యమం ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చిందని మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) 56వ సంచిక గోవా వేదికగా రేపటి నుంచి ప్రారంభం కానుంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 9 రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అనేక విభాగాల్లో వివిధ దేశాలకు చెందిన చలన చిత్రాలను ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శిస్తారు. అంతర్జాతీయ చిత్రాలే కాకుండా ఇండియన్ పనోరమా విభాగంలో ఎంపిక చేసిన భారతీయ చిత్రాలను కూడా ఈ ఉత్సవంలో ప్రదర్శిస్తారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ కు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం ఈరోజు రాత్రి 10 గంటలకు ప్రారంభమవుతుంది.

==========

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

==========
==========